



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట వైసిపి కార్పొరేటర్ల నిరసన

పక్కా కమర్షియల్

ప్రజాశక్తి ఎక్స్‌క్లూజివ్ 2



స్విమ్స్ వైద్యం లబ్ "డబ్బు"

స్విమ్స్‌లో 'పే' చేస్తేనే 'వైద్యం'


ఉచితాలు, రాయితీలకు చెల్లుచీటీ



వైద్యరంగంలో రాయలసీమకే కాకుండా యావత్ నవ్యాంధ్రకే తలమానికంగా నిలుస్తూ, పేదల పాలిట ఆరోగ్యప్రదాయినిగా పేరొందింది శ్రీ వేంకటేశ్వరా వైద్య, విజ్ఞాన సంస్థ(స్విమ్స్). గత మూడు దశాబ్దాల చరిత్రలో మానవసేవే ..మాధవసేవగా భావించి, తరించి ప్రగతిపథంలో పయనించిన స్విమ్స్...నేడు పాలకుల పుణ్యమా అంటూ పక్కా కమర్షియల్‌గా మారిపోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకప్పుడు డబ్బున్నోడికీ..పేదవాడికీ ఒకేరకమైన వైద్యం అందించి కీర్తిపతాకను అందుకున్న అదే ఆసుపత్రిలో నేడు సామాన్యునికి మెరుగైన వైద్యం అందని ద్రాక్షగానే మారిపోతోంది. ఇన్నాళ్లూ సంస్థ ప్రగతికి తార్కాణాలుగా నిలిచిన ఉచిత వైద్యం, క్యాంపులు, మందులు, రాయితీలకు చెల్లుచీటి పాడుతూ.. సామాజిక సేవ నుంచి క్రమేపీ తప్పుకుంటోంది. తిరుమల తిరుపతి దేవస్థానం వారి సంపూర్ణ ఆర్థిక సహకారంతో పాటు, శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టు, శ్రీబాలాజీ ఆరోగ్య వర ప్రసాదిని, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలతో పరిపుష్టిగా నిధులున్నప్పటికీ పేద రోగుల నుంచి ఫీజులను గుంజడంలో కార్పొరేట్ ఆసుపత్రులకు తామేమీ తక్కువ కాదనట్లు యాజమాన్యం వ్యవహరిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది.

ప్రజాశక్తి- తిరుపతి

పక్క చిత్రంలోని వ్యక్తి నాయబ్ రసూల్..కడప జిల్లా మైదుకూరు వాస్తవ్యుడు. నిరుపేద కుటుంబం. కుటుంబ పోషణకు బయట ప్రాంతాలకు వలసెళ్లి అనారోగ్యం బారిన పడ్డాడు. అయితే స్థానికంగా లేకపోవడంతో అతని ఆరోగ్యశ్రీ కార్డును ఏడాది క్రితమే తొలగించారన్న విషయం అతనికి తెలియదు. జీర్ణకోశ సంబంధిత వ్యాధి తీవ్రతరం కావడంతో స్థానికంగా ఉన్న ఆస్పత్రులన్నీ తిరిగి, ఆర్థికంగా చితికిపోయాడు. అయితే వ్యాధి నయం కాకపోవడంతో తెలిసిన వైద్యులు ఒకరు 'నీకు తెల్లరేషన్‌కార్డు ఉంది కదా, తిరుపతిలోని స్విమ్స్‌కు వెళ్లు.. అది టిటిడి పేదల కార్పొరేట్ ఆస్పత్రి.. అతి తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు, అత్యుత్తమ సేవలందిస్తారు. అవసరమైతే ప్రాణదానం పథకం కింద ఉచిత శస్త్ర చికిత్సలు చేస్తారు' అని చెప్పి పంపించారు. దీంతో కొండంత ఆశతో స్విమ్స్‌కు గత శనివారం (సెప్టెంబర్ 21న) వచ్చాడు.



రసూల్ ఓపీపై పేయింగ్‌గా నమోదు

ఇక్కడ ఓపి రిజిస్ట్రేషన్ నుంచీ, ఓపీడీ బ్లాక్‌లో వేచిఉండటం, ఫైల్ తీసుకోవడం, డాక్టర్ కన్సల్టేషన్, టెస్టులు చేయించుకోవడం, వాటికి బిల్లులు కట్టడం, తిరిగి రిపోర్టు కోసం ప్రదక్షిణలు చేయడం, ఆ తర్వాత డాక్టర్‌ను కలవడం ఓ ప్రహసనంలా మారింది. తీరా అవన్నీ పూర్తయ్యాక సోమవారం మళ్లీ స్విమ్స్ సిబ్బందిని కలిస్తే 'మీ ఆరోగ్య పరిస్థితి క్లిష్టంగా ఉంది. వెంటనే అడ్మిట్ కావాలి. బిల్లింగ్ సెక్షన్‌కు వెళ్లి బిల్లు కట్టి అడ్మిట్ కండి. ' అంటూ సమాధానమిచ్చారు. దీంతో నివ్వెరపోయిన ఆయన ' సార్...నా ఆర్థిక పరిస్థితి బాగోలేదు. తెల్లకార్డు ఉండి..ఆరోగ్యశ్రీ కార్డు లేని వాళ్లకు డాక్టర్ సిఫార్సు చేసి సిఎంసిఓ లెటరు ఇస్తే ఉచితంగా వైద్యం చేస్తారట. ఒక వేళ అదీ కుదరని పక్షంలో తెల్లరేషన్‌కార్డు ఉన్నోళ్లకు రాయితీతో వైద్యం, శస్త్రచికిత్స అవసరమైతే 'ప్రాణదానం' ద్వారా చేస్తారని తెలిసి, ఇక్కడకు వచ్చాను. మీరే హెల్ప్‌చేయండి..ప్లీజ్ ' అంటూ ప్రాధేయపడ్డారు. 'ఇప్పుడు అదంతా లేవు. అన్నీ మారిపోయాయి. మిమ్మల్ని పెయిడ్ కేసుగా రాసున్నారు. డబ్బులు కడితేనే ఇక్కడ వైద్యం.'అంటూ నిక్కచ్చిగా చెప్పేశారు. పేదల స్విమ్స్ ఇంత ' కమర్షియల్'గా మారితే మాలాంటి వాళ్ల పరిస్థితి ఏంటీ? అంటూ ఆక్రందన చెందుతూ ఆవేదనతో వెళ్లడం అతని వంతైంది.

కూటమికి 'బలం' లేకేనా..!

- స్టాండింగ్ కమిటీ ఎన్నికలు వాయిదా
- ఎన్నికలు నిర్వహించాలని వైసిపి ధర్నా
- కోర్టును ఆశ్రయిస్తామన్న మేయర్ శిరీష

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఊహించిన విధంగానే వాయిదా పడ్డాయి. నామినేషన్ ప్రక్రియ బుధవారం నిర్వహించాల్సిన ఉంది. నామినేషన్ వేసేందుకు వైసిపి కార్పొరేటర్లతో పాటు మేయర్ డాక్టర్ శిరీష కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయంలోని విసి హాల్లో మేయర్‌తో పాటు కార్పొరేటర్లు తగిన సంఖ్యాబలంతో వచ్చారు. ఎన్నికలు నిర్వహించడానికి కమిషనర్ సమాధానం చెప్పాల్సి ఉండగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యదర్శి రాధిక వచ్చి ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు మేయర్ డాక్టర్ శిరీష దగ్గరకు వచ్చి నోటీసు ఇచ్చారు. దీనికి మేయర్ డాక్టర్ శిరీషతో పాటు పలువురు కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు ఎన్నికల వాయిదా వేస్తున్నట్టు ముందుగానే ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. మున్సిపల్ కార్యదర్శి ఎన్నికలు ఎందుకు వాయిదా వేస్తున్నారో సమాధానం రాతపూర్వకంగా లేకపోవడంతో వైసిపి కార్పొరేటర్లు ఎన్నికలు జరిపించాలని నినాదాలు చేశారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల కోసం కార్పొరేషన్ కార్యాలయంలో గొడవ జరగకుండా ఉండేందుకు భారీ ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. టిడిపి జనసేన పార్టీకి చెందిన కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పాల్గొనేందుకు రాలేదు. ఎన్నికలు జరిపించాలని వైసీపీ కార్పొరేటర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో 50 డివిజన్లలో 31 మంది కార్పొరేటర్లు వైసీపీ తరఫున ఉన్నారని, టిడిపి జనసేన పార్టీ నుంచి 16 మంది కార్పొరేటర్లే ఉన్నారని, బలం లేకనే కూటమి పార్టీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఈ ఎన్నికలు జరగకుండా ఉండేందుకు వాయిదా వేయించారని వైసీపీ కార్పొరేటర్లు ఆరోపించారు. అవసరమైతే కోర్టును ఆశ్రయించి ఎన్నికలు జరపాలని కోరుతామని పేర్కొన్నారు. అక్టోబర్ నాలుగో తేదీ జరగాల్సిన ఈ ఎన్నికలు తిరుమల బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతుండడం, ఈ కార్యక్రమానికి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించడానికి వస్తున్నారనే కారణంతోనే ఎన్నికలు వాయిదా వేసినట్లు మేయర్ శిరీష ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలను అడ్డుకోవడానికి టిడిపి జనసేన పార్టీ నేతలు వైసిపి కార్పొరేటర్లపై అక్రమ కేసులు బనాయించి వారి వైపు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించే వరకు వైసిపి కార్పొరేటర్లు పోరాటం చేస్తారని మేయర్ డాక్టర్ శిరీష హెచ్చరించారు. ఎన్నికల వాయిదా వేయడానికి కారణాలు కమిషనర్ సక్రమంగా చెప్పకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఎస్కే బాబు, శేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ఉమాదేవి ,ఆరని సంధ్యారెడ్డి, కో ఆప్షన్ మెంబర్ వెంకట్ రెడ్డి, తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ చైర్మన్ రామారావు అమర్నాథ్ రెడ్డి వైసీపీ నేతలు పాల్గొన్నారు.

నేడు 'స్వచ్ఛత హి సేవ' 3కె రన్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలలో భాగంగా గురువారం 3కె రన్ నిర్వహిస్తున్నామని కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం సీతమ్మ నగర్ రోడ్డు, వెంకటరమణ లేఔట్ లోని పార్కు నందు విద్యార్థులు, మహిళలతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మౌర్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైన ఉందని అన్నారు. గురువారం ఉదయం మూడు కిలోమీటర్ల పరుగు పందెం, వేస్ట్ టు వండర్ పోటీలు, వీధి నాటకాలు, పారిశుధ్య కార్మికులకు పిపిఈ కిట్ల పంపిణీ, ఆరోగ్య పరీక్షల నిర్వహణ వంటి పలు కార్యక్రమాలు నిర్వహించనున్నామని అన్నారు. ఉదయం ఆరు గంటలకు వివేకానంద కూడలి నుండి ఎస్.వి.యూనివర్సిటీ వరకు ఈ పరుగుపందెం ఉంటుందని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.మహేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, మెప్మా కష్ణవేణి ఉన్నారు.

ఆర్టీవో మురళీమోహన్‌కు సత్కారం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మురళీమోహన్‌ను రాష్ట్ర రవాణా శాఖ సభ్యులు ముత్తంశెట్టి సునీల్ చక్రవర్తి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

హమాలీలకు కూలిరేట్లు పెంచాలి

తిరుపతి సిటి : సివిల్ సప్లై గోడౌన్ హమాలీలకు కూలీరేట్లను పెంచి, అరియర్స్ తో కలిపి జి.ఓ. విడుదల చేయాలని, రూట్ ఆప్టిమేషన్ రద్దు చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీలు నల్ల రిబ్బనులతో ధర్నా నిర్వహించారు. స్థానిక మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న సివిల్ సప్లై వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కే రాధాకష్ణ మాట్లాడుతూ సివిల్ సప్లైస్ కార్మికులకు పాత అగ్రిమెంట్ అయిపోయి 9 నెలలు గడుస్తున్నా ఇంతవరకు నూతన అగ్రిమెంట్ చేయడానికి ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ డి రవి, చెంచు కష్ణయ్య పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి డివిజన్ యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలను నిర్వహించారు. టంగుటూరి ప్రకాశం పంతులు మున్సిపల్ హైస్కూలు ఆవరణలో బుధవారం షటిల్‌బ్యాడ్మెంటన్ పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్‌కుమార్ పోటీలను ప్రారంభించారు. క్రీడల వల్ల ఆనందం కలుగుతుందని, పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ముత్యాలరెడ్డి, నాయకులు డి.నిర్మల, బండి మధుసూదన్‌రెడ్డి,పద్మజ, ఎస్.ఖాదర్‌బాషా, వై.హేమాద్రిబాబు పాల్గొన్నారు.

సతీష్ ధావన్‌కు షార్‌లో నివాళి

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ సతీష్ ధావన్ జయంతిని బుధవారం షార్‌లో ఘనంగా జరుపుకున్నారు. శ్రీహరికోటలోని జీరో పాయింట్ వద్ద ఉన్న సతీష్ ధావన్ విగ్రహానికి షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ చేతులు మీదుగా పూలు వేసి నివాళి అర్పించారు. షార్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 123 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో షార్ అసోసియేట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి సిపిఎం కార్యాలయంలో సీతారాం ఏచూరికి రాజకీయ పార్టీలకు అతీతంగా నివాళి

నిత్య స్ఫూర్తి ఏచూరి

సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'ఏచూరి నిత్య స్ఫూర్తి..భావి తరాలు అధ్యయనం చేయాల్సిన పుస్తకం..ఎర్ర సూరీడు.. మరణమే లేని అరుణ తార... మతోన్మాదుల సింహ స్వప్నం.. కమ్యూనిస్టు ఉద్యమాల దిక్సూచి' అంటూ వక్తలు కొనియాడారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభను శ్రీకాళహస్తి పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలకతీతంగా పలువురు నాయకులు ఏచూరి సంతాప సభలో పాల్గొని అరుణాంజలి ఘటించారు. ఏచూరి అమర్ రహే అంటూ నినదించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ ఏచూరి జీవితం నిత్య స్ఫూర్తి అంటూ కొనియాడారు. ఆయన మరణం కమ్యూనిస్టు పార్టీకే కాదు యావత్ భారతావనికి, ప్రపంచానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. కమ్యూనిజానికి కాలం చెల్లిందన్న రోజుల్లో సోషలిజం అజేయం..శాస్త్రీయమంటూ అంతర్జాతీయ వేదికల్లో నినదించిన ధీరోత్తముడని కొనియాడారు. నేటి తరం సెక్యులర్ వాదులమంతా ఏచూరి ఆశయాల వారసులుగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఏచూరి ఆశయాల సాధకులైన కామ్రేడ్ల బాటలో తాము నడుస్తామని పీసీసీ కార్యదర్శి డాక్టర్ బత్తెయ్యనాయుడు, వైసీపీ నేత, మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి, జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్, జానవిజ్ఞాన వేదిక నాయకులు షరీఫ్ అన్నారు. టీడీపీ నేతలు విజయ్ కుమార్ నాయుడు, మునిరాజా నాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, పట్టణ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, హరినాథ్ పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతుల ధర్నా

రైతులకు పెట్టుబడి సాయం చేయండి

ప్రజాశక్తి - బిఎన్ కండ్రిగ

రబీ సీజన్‌లో వ్యవసాయ సాగు కోసం ప్రభుత్వం రైతులకు రుణ సౌకర్యం, పెట్టుబడి ఆర్థిక సహాయం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నలుగూరి రమణయ్య మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి రాజకీయ నాయకులు రైతులకు అది చేస్తాం ఇది చేస్తాం అంటూ హామీలు ఇస్తున్నారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత గాలికి వదిలేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు నాయుడు పెట్టుబడి సహాయం కింద రైతులకు 20వేల రూపాయలు ఆర్థిక పెట్టుబడి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఈ సీజన్లో ఎటువంటి రుణ సాయం అందలేదన్నారు. దీంతో రైతులు బ్యాంకుల చుట్టూ, వడ్డీ వ్యాపారస్తుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. అన్నదాతలకు పెట్టుబడి సహాయం కింద 20 వేల రూపాయలు, జీవో 22 రద్దు, భూ యజమాని సంతకం నిమిత్తం లేకుండా కౌలు రైతులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు, జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి మరమతులు చేపట్టి వ్యవసాయానికి సాగునీరు అందించాలన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు టి బాల గురవయ్య, ఎస్ తిరుపాలయ్య ,కత్తి గురవయ్య పాల్గొన్నారు.

అజ్ఞాతంలో ఈస్ట్ సీఐ?

రోజంతా పని చేయని ఫోన్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, 24 గంటలపాటు సమాజ భద్రత కోసం పాటుపడాల్సిన ఓ పోలీస్ అధికారి అజ్ఞాతంలో ఉన్నారు. 24 గంటలుగా ఆయన అధికారిక ఫోన్ పనిచేయకపోవడం గమనార్హం. తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో ప్రతిరోజు వీఐపీలు, వివిఐపీలు తిరుపతికి రాకపోకలు సాగిస్తుంటారు. వీరందరికీ భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులదే. ప్రోటోకాల్ విధులు నిర్వహణ కీలక బాధ్యత ఈస్ట్ పోలీస్ స్టేషన్ అధికారులదే. అంతటి ప్రాధాన్యత గల ఈస్ట్ పోలీస్ స్టేషన్కు స్టేషన్ హౌస్ ఆఫీసర్ అయినా సర్కిల్ ఇన్స్పెక్టర్ మహేశ్వర్ రెడ్డి రెండు రోజులుగా అజ్ఞాతంలో ఉన్నారు. గత 24 గంటలు పైగా ప్రభుత్వం అందజేసిన అధికారిక ఫోన్ నెంబర్ సైతం స్విచ్ ఆఫ్ చేసి ఉంది. దీంతో సిఐ ఏమయ్యాడు...? ఆయనకి ఏం జరిగిందో అన్న విషయం ఈస్ట్ పోలీస్ సిబ్బందిలో ఆందోళన కలిగిస్తోంది. ఉన్నతాధికారుల ఒత్తిడి కారణంగానే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లినట్టు పలువురు సిబ్బంది గుసగుసలాడుకున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి, సీఐ ఏం అయ్యాడు, అతనికి ఏం జరిగిందో వెల్లడించాల్సిన అవసరం ఉంది.

కల్తీ నెయ్యి కారకులకు శిక్ష తప్పదు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాల్లో జంతుకొవ్వుతో కూడిన నెయ్యి వినియోగంతో భక్తుల మనోభావాలు దెబ్బతినడంతో జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత దీక్ష కు సంఘీభావంగా ఆటోనగర్ లోని శివాలయంలో మహా హోమానికి సతీసమేతంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరైయ్యారు. సిట్ దర్యాప్తులో నిజాలు బయటపడతాయని ఆయన తెలిపారు. కల్తీ నెయ్యి కారకులు జైలుకెళ్ళడం ఖాయమని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పొలకల మల్లిఖార్జున్ , రాజా రెడ్డి, కీర్తన, గోపి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో 'చెకుముకి' టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి - రేణిగుంట, యంత్రాంగం



ఉన్నత పాఠశాల విద్యార్థులలో శాస్త్రీయ దక్పథం పెంపొందించేందుకు ప్రతి సంవత్సరము రాష్ట్ర వ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాల పేరుతో టాలెంట్ టెస్టును జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తుంది. అందులో భాగంగా ఈనెల 25 తేదీన బుధవారం పాఠశాల స్థాయి టాలెంట్ టెస్టును తిరుపతి జిల్లాలో 350 ఉన్నత పాఠశాలల్లో 18వేల మంది విద్యార్థులకు నిర్వహించినట్లు జెవివి జిల్లా కార్యదర్శి రెడ్డప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబర్ 27న జిల్లాస్థాయిలో, నవంబర్ 9, 10 తేదీల్లో రాష్ట్రస్థాయిలో పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఫీ, లక్ష్మీనారాయణ, బాల, హర్షద్, గణేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన పెరగాలని జెవివి నియోజకవర్గ కార్యదర్శి బి.చెంచయ్య అన్నారు. తొట్టంబేడు మండలం గుండేలిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టాలెంట్ పరీక్ష నిర్వహించారు. జెవివి నాయకులు కె..మునీశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ముని తిరుమలయ్య, సైన్సు ఉపాధ్యాయులు మస్తానయ్య, ఢిల్లీబాబు, ఉపాధ్యాయులు భాస్కరయ్య, రమాదేవి, శ్రీకర్, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

మన్నవరం బెల్ పరిశ్రమ పరిశీలన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రూరల్ మండలం మన్నవరం వద్ద స్థాపించిన ఎన్బిపిపిఎల్, బెల్ పరిశ్రమను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ బుధవారం పరిశీలించారు. కంపెనీ ప్రతినిధులతో పలు అంశాలపై చర్చించారు. ప్రస్తుతం అక్కడ జరుగుతున్న పనులపై ఆరా తీశారు. అనంతరం పరిశ్రమకు కేటాయుంచిన 750 ఎకరాల్లో ఎంత భూమిని పరిశ్రమల స్థాపనకు వినియోగించారో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. తక్కిన భూమి సంగతేంటని ఆరా తీశారు. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్టీపిసి, బిహెచ్ఈఎల్ పవర్ ప్రాజెక్ట్ లిమిటెడ్ కోసం 750 ఎకరాల భూమిని రూ.750కే కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే ఆ రెండు పరిశ్రమలు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం కోల్పోగానే దాదాపు మూతపడ్డాయి. అందులో పనిచేస్తున్న కార్మికులు రోడ్డున పడ్డారు. 20 వేల ఉద్యోగాల మాట అటకెక్కింది. అయితే రాయలసీమ ప్రాంతానికి తలమానికమైన మన్నవరం పరిశ్రమపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏడాదికో మాట చెబుతూ నిరుద్యోగులకు అరచేతిలో వైకుంఠం చూపుతోంది. బెల్ పరిశ్రమను గుజరాత్ తరలించినట్లుగా విమర్శలు వచ్చాయి. తాజాగా జిల్లా కలెక్టర్ తో కలిసి ఎమ్మెల్యే బొజ్జల పరిశ్రమలో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆర్డీవో రవి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి ప్రాధాన్యత

మాజీ మంత్రివర్యులు బొజ్జల గోపాల కష్ణారెడ్డి మానస పుత్రిక అయిన శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తామని స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి అన్నారు. బుధవారం ఆమె శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిని పరిశీలించారు. డ్రగ్ స్టోర్ రూమ్ ను తనిఖీ చేసి మందులను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు విజయ్ కుమార్ నాయుడు, మునిరాజా నాయుడు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పోలేరమ్మ జాతర

నేడు అమ్మవారి విరూపోత్సవం

ప్రజాశక్తి - వెంకటగిరి, డక్కిలి

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి గ్రామశక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతరను గత ఏడాది నుంచి రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం వినాయక చవితి వెళ్లినాక తొలి బుధవారం నుండి జాతరను మొదలు పెడతారు. 1992లో దివంగత మాజీ సీఎం నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి పోలేరమ్మ ఆలయాన్ని దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకొచ్చారు. అయినా పోలేరమ్మ జాతరను సనాతన సాంప్రదాయంగానే రాజులు సూచన, సలహాలతోనే ఇప్పటికీ నిర్వహిస్తున్నారు. పోలేరమ్మ జాతర బుధవారం ఘనంగా ప్రారంభమయ్యింది.గత ఆదివారం నుంచి ఘటోత్సావ్ని నిర్వహించారు. బుధవారం మడిభిక్షలు ఎత్తి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. 'పోలేరమ్మకు మడిభిక్షం పెట్టండి.. పోతురాజుకు టెంకాయ కొట్టండి.. పగలకపోతే మా నెత్తిన కొట్టండి' అంటూ సంప్రదాయబద్దంగా మడిభిక్షం నిర్వహించారు. చాకలివీధిలో పుట్టమట్టితో చాకలి కుటుంబాల వారు తయారు చేసిన పోలేరమ్మకు కళ్లు పెట్టకుండా అలంకరించి భక్తులకు దర్శనం కోసం ఉంచారు. రాత్రి 11 గంటలకు అత్తవారిల్లుగా భావించే జీనుగుల వారి వీధికి తీసుకెళ్లి అమ్మవారిని అక్కడ కళ్ళు పెట్టి బంగారు నగలతో అలంకరించారు. అక్కడ నుంచి లక్షలాది మంది భక్తుల నడుమ రథంపై ఊరేగింపుగా అమ్మవారి గుడి వద్దకు తీసుకువచ్చి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.



రాష్ట్ర పండుగగా జాతర : సాయికృష్ణ యాచేంద్ర

పోలేరమ్మ జాతరలో వెంకటగిరి నుంచి ఇతర దేశాలు రాష్ట్రాల్లో స్థిరపడిన వారు సైతం వచ్చి పాల్గొంటారు. పోలేరమ్మ జాతర తమ పూర్వీకుల నుంచి జరుగుతున్నట్లు రాజ వంశస్థులు మాజీ ఎస్వీబీసీ ఛైర్మన్ సాయికష్ణ యాచేంద్ర తెలిపారు. గత ఏడాది నుండి రాష్ట్ర పండగ గా పోలేరమ్మ అమ్మవారి జాతరను ప్రభుత్వం గుర్తించి జాతర నిర్వహణకు నిధులు విడుదల చేస్తుంది. జాతరకు వచ్చే భక్తుల కోసం అన్నీ ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకష్ణ, ఆలయం ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా క్యూ లైన్, పార్కింగ్ వంటి వసతులు ఏర్పాటు చేశామని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న సన్ రైజ్ స్కూలు యాజమాన్యం, విద్యార్థులు

ప్రజాశక్తి - సత్యవేడు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సత్యవేడు సన్ రైజ్ హైస్కూలు ఆధ్వర్యంలో బుధవారం విరాళాలు సేకరించారు. సన్‌రైజ్ ఇంగ్లీష్ మీడియం ఛైర్మన్ ప్రియాంక, కరస్పాండెంట్ సతీష్, ప్రిన్సిపాల్ ఆశ తదితరులు రెండు రోజులుగా ఇటు ఉపాధ్యాయులు, అటు విద్యార్థుల నుంచి విరాళాలను సేకరించారు. ఈ నేపథ్యంలో సేకరించిన విరాళాల సొమ్ము 20 వేల రూపాయలను బుధవారం రాష్ట్ర ప్రైవేట్ స్కూలు అసోసియేషన్ ఛైర్మన్ సుబ్రహ్మణ్యం రాజుకు చెక్కు రూపంలో పంపించామని సన్ రైజ్ హైస్కూల్ కరస్పాండెంట్ సతీష్ తెలిపారు.

పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా మాధవయ్య



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్ర పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా గంజి మాధవయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2013వ సంవత్సరంలో టిడిపి తరపున రామకృష్ణాపురం సర్పంచ్‌గా రాజకీయ జీవితం ప్రారంభించిన మాధవయ్య తర్వాత ఏడాది 2014లో ఎంపిటిసిగా గెలిచి పుత్తూరు మండల ప్రజా పరిషత్ (ఎంపిపి) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. చిత్తూరు జిల్లా గ్రంథాలయ కమిటీ సభ్యుడిగా పని చేశారు. అనంతరం టిడిపి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడిగా పదవిలో సేవలు అందించారు. పుత్తూరులో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం కార్యక్రమం విజయవంతం చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఇటీవల టిడిపి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో మాధవయ్య పార్టీకి చేసిన సేవలను గుర్తించి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సిఫార్సు మేరకు ఆయనకు రాష్ట్ర స్థాయి డైరెక్టర్ పదవి లభించింది.

'తాగునీటి మోటారులో డీజిల్ పోశారు..!'

ప్రజాశక్తి -నాయుడుపేట: గ్రామస్తుల కోసం ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ మోటార్లో మంగళవారం అర్ధరాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు డీజిల్ పోయడం పై గ్రామంలో కలకలం రేగింది. మండలం మేనకూరు సెజ్ పరిధిలోని ఇండస్ కాఫీ సంస్థ కోనేటిరాజుపాళెం గ్రామస్తులు తాగునీరు కోసం అష్ట కష్టలు పడుతున్న క్రమంలో ఆ కంపెనీ నిర్వాహకులు స్పందించి గ్రామంలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. ఈ ప్లాంట్ ప్రయవేటు వాటర్ ప్లాంట్ వారికి ఇది పెద్ద షాక్ కావడంతో దీన్ని ఆరు నెలలు పాటు వైసిపి ప్రభుత్వం మూసి వేసింది. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వాటర్ ప్లాంటు టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఇది సహించలేని కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు ప్లాంటు మోటార్లో డీజిల్ పోశారు. ఉదయం ప్లాంట్ లో తాగునీటి కోసం క్యాన్ పెట్టగా డీజిల్ తో కలిసి ఉన్న నీరు రావడంతో నిర్వాహకులు వెంటనే పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇచ్చారు. ఈ సమాచారం అందుకున్న కార్యదర్శి ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను గుర్తించి తర్వలో వాళ్లకి శిక్ష పడేలా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్రీడల్లో రాణించి సత్తా చాటాలి..

ప్రజాశక్తి- వరదయ్యపాళెం: క్రీడల్లో విద్యార్థుల రాణించి ప్రతిభ చాటాలని హెచ్ఎం, రమణయ్య, జెడ్‌పిటిసి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వరదయ్యపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల సంఘ కమిటీ ఛైర్మన్ పి ఉదయ్ కుమార్ అధ్యక్షతన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం వైస్ ప్రెసిడెంట్ బండికమూరి కిశోర్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి క్రీడా (ఖోఖో) పోటీలలో ఏడు మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ నియోజవర్గ ఖోఖో ఫైనల్ పోటీల్లో వివిధ జట్లు విజయం సాధించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం వైస్ ప్రెసిడెంట్ కిషోర్, పుత్తూరు డివిజన్ పిఈటీ సంఘం ప్రెసిడెంట్ భక్త గోపాల్ నియోజకవర్గ పిఈటీలు ముద్దుకృష్ణ, వినోద్ మనోహర్ సురేంద్ర మస్తాన్ కిషోర్, మణి, నాగరాజు, దాసు మహేష్ పాల్గొన్నారు.

'చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కల్తీ నెయ్యి ఘటనలో చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద స్వామి పేర్కొన్నారు. బుధవారం ఆయన తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయపై దాడులు, విగ్రహాలు, రథాల ధ్వంసం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాధు పరిషత్ ఆధ్వర్యంలో తిరుమల ఖ్యాతికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో రెడ్డి శేఖర్ రాయల్, గణేష్ స్వామి, మాతాజీ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అన్నదానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాజీ మున్సిపల్ ఛైర్మన్ కందాటి శంకర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో తిరుపతి రుయాస్పత్రి వద్ద పేదలకు బుధవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన కుమారులు కందాటి సురేష్ రెడ్డి, కందాటి మిధున్ రెడ్డి, టిడిపి నాయకులు బీజీ కృష్ణ యాదవ్, ఆనంద్ యాదవ్, విజయ్ కుమార్, తిరుమల టిడిపి అధ్యక్షులు రాజు యాదవ్, దొడ్డారెడ్డి శ్రీనివాసుల రెడ్డి, చుక్కల దాము, లలితమ్మ కందాటి శంకర్ రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రెండువేల మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ రెడ్డి అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సోదరుడు మృతి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తమ్ముడు కోనేటి పాండురంగం (68) బుధవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు. నారాయణవనం మండలం భీముని చెరువుకు చెందిన కోనేటి పాండురంగం రెండు రోజులు క్రితం అస్వస్థతకు గురికావడంతో బంధువులు చికిత్స నిమిత్తం హుటాహుటిన తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. బుధవారం మధ్యాహ్నం పాండురంగంకు హఠాత్తుగా గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనతో ఎమ్మెల్యే ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి.

పర్యాటక దినోత్సవ ర్యాలీని విజయవంతం చేద్దాం: డిఇవో

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): ఈ నెల 27వ తేదీ పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలని తిరుపతి డిప్యూటీ డిఇవో బాలాజీ పిలుపునిచ్చారు. చంద్రగిరిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలకోటలో 27వ తేదీ లైట్ అండ్ సౌండ్ ప్రదర్శనను స్థానిక ఎమ్మెల్యే నాని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రతి పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేయాలన్నారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా 27వ తేదీ టవర్ క్లాక్ నుండి రాయల్ కోట వరకు భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. విజేతలకు 27వ తేదీ బహుమతులు అందిస్తామని తిరుపతి ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ పేర్కొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి..

ప్రజాశక్తి - సత్యవేడు: గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్‌లో వున్న వేతనాలు చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండు చేశారు. సత్యవేడు మండల సిపిఎం కార్యాలయంలో సిఐటియు అనుబంధ కార్మిక సంఘం గ్రీన్ అంబాసిడర్ వర్కర్ల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు మండల గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శేఖర్ కార్యదర్శి మునుస్వామి మాట్లాడుతూ సుమారు 45 నెలల నుండి 25 నెలల వరకు పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వలేదని వెంటనే చెల్లించాలని కోరారు. జీతాలు చెల్లించకుంటే ఈనెల 30వ తేదీ కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశం లో గ్రీన్ అంబాసిడర్స్ వర్కర్స్ యూనియన్ మండల సభ్యులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

అంకిత భావంతో సేవలు అందించండి: అదనపు ఈవో


భక్తులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలిస్తున్న టిటిడి అదనపు ఈవో

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: శ్రీవారి సేవకులు అత్యంత క్రమశిక్షణ, అంకితభావం, భక్తి శ్రద్ధలతో శ్రీవారి భక్తులకు సేవలు అందించాలని, యాత్రికులకు అందుతున్న వివిధ సేవలపై అభిప్రాయ సేకరణ చేయాలని టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి పిలుపు నిచ్చారు. తిరుమలలోని సేవాసదన్-2లో బుధవారం సాయంత్రం జరిగిన సత్సంగ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన శ్రీవారి సేవకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ శ్రీవారి సేవకులు భక్తుల కు సేవలందించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాము సేవలందించే ప్రాంతాలలో భక్తులకు అందుతున్న సదుపాయాలను గమనించి, వాటిపై అభిప్రా య సేకరణను చేసి తమకు అందించి, తద్వారా వారికి అందుతున్న సౌకర్యాలు మెరుగుపరచడం లో కీలక పాత్ర పోషించాలన్నారు. ఆన్‌లైన్‌లో శ్రీవారి సేవ రిజిస్ట్రేషన్‌తోపాటు, ఎలక్ట్రానిక్ డిప్ సిస్టమ్ ద్వారా ఆలయ విధుల కేటాయింపులు ఎంతో పారదర్శకంగా అందుతాయని తెలిపారు. అనంతరం శ్రీవారి సేవకులకు ఆయనే స్వయం గా ఈ-డిప్ విధానంలో ఆలయ డ్యూటీని విడుదల చేశారు. అంతకుముందు శ్రీవారి సేవకులు, భజన, ధ్యాన కార్యక్రమాలు జరిగాయి .ఈ కార్యక్రమంలో చీఫ్ పీఆర్వో డాక్టర్ టీ రవి, పీఆర్వో కుమారి పి.నీలిమ, శ్రీవారి సేవ, ప్రజా సంబంధాల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో పలువురు సిఐలు బదిలీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు ఎస్పీ కార్యాలయం విఆర్‌ఓలో ఉన్న డి మునస్వామి పుత్తూరు రూరల్ సర్కిల్ సీఐగా, పుత్తూరు రూరల్ సర్కిల్ సిఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎం భాస్కర్ నాయకును తిరుపతి ఎస్ పి విఆర్ కు, తిరుపతి ఎస్పీవీఆర్ లో ఉన్న వి చిన్న పెద్దయ్యను శ్రీ సిటీ పీఎస్ కు, తిరుపతి ఎస్పీవీఆర్ లో ఉన్న పి శ్రీరాములును తిరుపతి డిటిఆర్బికి, తిరుపతి ట్రాఫిక్ సిఐగా విధులు నిర్వహిస్తున్న కే శ్రీనివాసులను తిరపతి ఈస్ట్ సీఐగా, తిరపతి ఈస్ట్ సిఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న డి మహేశ్వర్ రెడ్డిని తిరుపతి ఎస్పీవీఆర్‌కు, తిరపతి డిటిసి లో విధులు నిర్వహిస్తున్న ఏ శ్రీరాముడును తిరుమల టూ టౌన్ కు, తిరుమల టూ టౌన్ సిఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఏ సత్యనారాయణ ను వి ఆర్ ఎస్ పి తిరుపతికి బదిలీ చేశారు. ఈ మేరకు ఒకటి రెండు రోజుల్లో బదిలీ అయిన ప్రాంతాలలో వారు బాధ్యతలు చేపట్టనున్నారు.

రక్తదానం చేయండి..ప్రాణం కాపాడండి: వీసీ

ప్రజాశక్తి - క్యాంపస్ : రక్తదానం చేసి ప్రాణాలు కాడాలని ఎస్‌వియూ విసి ఆచార్య అప్పారావు పిలుపు నిచ్చారు. ఎస్‌వియూ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వర్సిటీ ఆరోగ్య కేంద్రంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ సమాజంలో ఎంతోమంది పేదవారు రక్తం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు జరిగినప్పుడు వ్యక్తులకు, రోగులకు అవసరమైన రక్తాన్ని దానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాన్ని కాపాడవచ్చునని పేర్కొన్నారు. ఈ రక్తదాన శిబిరంలో దాదాపు 60 మంది రక్తదానం చేసినట్లు కో ఆర్డినేటర్ పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో అధ్యాపకులు, పరిశోధ కులు, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు సుస్థిర భవిష్యత్తుకు పునాది..



మాట్లాడుతున్న ప్రాజెక్ట్ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ నీరజ

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రకృతి వ్యవసాయ పద్ధతులు సుస్థిర భవిష్యత్తుకు పునాది అని ప్రాజెక్ట్ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ నీరజ పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన విభాగం, బయో సైన్స్ అండ్ సెరికల్చర్, న్యాయ విభాగాలు సంయుక్తంగా సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై మహిళలకు మూడు రోజుల పాటు ఉచిత శిక్షణ అందించారు. తిరుపతి రూరల్ మండలంలోని వేమూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన ఈ శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ నీరజ మాట్లాడుతూ మహిళలకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించి ఉత్పాదకత సామర్థ్యాన్ని పెంచి, తద్వారా పర్యావరణ సుస్థిరతను, మహిళా సాధికారతను సాధించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా వర్సిటీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

'ఎస్‌వియూ మాజీ విసి సేవలు శ్లాఘనీయం'

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి, తత్వశాస్త్ర విభాగపు సీనియర్ ఆచార్యులు ఆచార్య సచ్చిదానందమూర్తి సేవలు ప్రశంస నీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆచార్య సచ్చిదానందమూర్తి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. 1975-78 సంవత్సరాల కాలంలో తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా అద్వితీయమైన సేవలు అందించారని పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం చంద్రయ్య, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసరావు నాయక్, డాక్టర్ ఎన్ దయాకర్, డాక్టర్ కే జయరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలలో ముందస్తు దసరా సంబరాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం బీఈడీ కళాశాలలో ముందస్తు దసరా ఉత్సవ సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి జానకిరామయ్య పాల్గొని మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, దసరాను పది రోజులు నిర్వహిస్తారన్నారు. 10వ రోజున పౌర్ణమి కనిపించడంతో జరుపుకుంటారన్నారు. వర్సిటీలోని విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులు, సుఖ సంతోషాలతో దసరా మహోత్సవాలని జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఈడీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో ఆరూరు విద్యార్థుల సత్తా


క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

ప్రజాశక్తి:- చిట్టమూరు: జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ, అండర్ 14-17 పోటీలకు ఆరూరు హైస్కూలు విద్యార్థులు ఎంపికై క్రీడల్లో తమసత్తా చాటుకున్నారు. ఆరూరు విద్యార్థులు మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. కోట మండలం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నియోజక వర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు నిర్వహించారు. ఇటీవల మండల స్థాయిలో ఎంపికలు నిర్వహించామని పిఈటి సురేష్ తెలిపారు. ఈ క్రమంలో బుధవారం కోట బాయ్స్ బాలుర హై స్కూల్లో పోటీలు నిర్వహించగా వాలీబాల్, కబడి, అండర్ 14-17 నుంచి గెలుపొందారని, నిహాల్ సాయి డిస్క్ త్రో, లాంగ్ జంప్ లో గెలిచారన్నారు. విజేతలకు 27 నుంచి 2 తేదీ వరకు నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు మరెన్నో విజయాలు సాధించాలని హెచ్ఎం జ్యోతి ఆకాంక్షించారు.

'సవకల' తొలగింపు హేయం: ఎఐకెఎస్

పజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని విందూరు పొలంలో సాగులో వున్న సవకలను కొందరు పెత్తందారులు తొలగించడం హేయమైన చర్య అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గూడూరు డివిజన్ నాయకులు జోగి శివకుమార్ పేర్కొన్నారు. గూడూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట బాధితురాలు భవనమ్మతో కలిసి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (సిపిఎం) అధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు జోగి శివ కుమార్ మాట్లాడుతూ సాగులో ఉన్న సవకలను విందూరులో కొంత మంది పెత్తందారులు జెసిబితో తొలగించడం దారుణం అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలన్నారు. బాధితురాలు భవనమ్మ మాట్లాడుతూ విందూరులో అనేక సంవత్సరాలుగా సవక వేసుకొని జీవనం సాగిస్తున్నామని అయితే కొంతమంది సవకను జెసిబిలతో తొలగించారన్నారు. అధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోగి శివకుమార్, శ్రీనివాసులు, సురేష్ , ప్రసాద్ , చంద్రయ్య , విందూరు గ్రామస్తులు పాల్గొన్నారు .

సమస్యలు పరిష్కరించండి..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక 29వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ఎం మంజునాథ గౌడ్‌కి సిపిఎం డివిజన్ కార్యదర్శి ఆర్ వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక 29 వార్డులో చెత్త కుప్పలు పేరుకుపోయాయని, మురికి కాలువలో చెత్తను సక్రమంగా తీయడం లేదని వెంటనే పరిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. ప్రజలు, విద్యార్థులకు విష జ్వరాలు, డెంగీ వచ్చి ఆస్పత్రి పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ కట్టడాలు, లేఅవుట్లను అరికట్టాలని, ట్యాంకుల్లో 15 రోజులకు ఒకసారి శుభ్రం పరిచి ప్రజలకు తాగునీరు అందించాలని, అన్ని వార్డుల్లో దోమల నివారణ చేపట్టాలని, శ్మశానంలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వీధుల్లో సిసి రోడ్లు, వీధి కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. కమిషనర్ స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై నందయ్య, సిపిఎం నాయకులు రమేష్ , విజయ్, పళణి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'తో లాభసాటి వ్యవసాయం

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: 'పొలం పిలుస్తోంది'తో లాభసాటి వ్యవసాయం సాధ్యమవుతుందని మండల వ్యవసాయ అధికారి ఖాదర్ బాషా పేర్కొన్నారు. మండలంలోని నెరబైలు, చింతగుంట గ్రామ పంచాయతీలలో 'పొలం పిలుస్తోంది'ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సభలు నిర్వహించి వరి, వేరుశనగ,మామిడి, పీఎండీ ఎస్ ప్లాట్లను పరిశీలించి రైతులకు మెలకువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవేంద్ర, మార్కెట్ యార్డ్ మురళి, రైతు సేవ కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని వెందొడు , కాంద్ర గ్రామాలలో 'పొలం పిలుస్తుంది'ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రమేష్ భూసార పరీక్షలు ఆవశ్యకత , రబీ పంటల సాగు, యాక్షన్ ప్లాన్‌ను తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి గూడూరు మండల అధ్యక్షులు కొండూరు వెంకటేశ్వర రాజు , కాంద్ర , వెండోడు గ్రామ నాయకులు , డాక్టర్ సుదర్శన్, కార్తిక్, రైతులు పాల్గొన్నారు.

కోట : కోట మండలంలోని కొక్కుపాడు పంచాయతీలో మండల వ్యవసాయ అధికారి వి. నిరంజన్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు భూసార పరీక్షలుపై అవగాహన కల్పించి సాగు చేస్తున్న పంటలను ఈ పంట నందు నమోదు చేసుకోవాలన్నారు.

క్రైం న్యూస్

15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి నెల్లూరు జిల్లా రాపూరు అటవీ ప్రాంతంలో 15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అరెస్టు చేసి మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల సూచనలతో కడప సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులు ఆధీనంలోని ఆర్ఎస్ఐ ఎం మురళీధర్‌రెడ్డి బృందం మంగళవారం రాత్రి నుంచి రాపూరు అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టిందని అధికారులు తెలిపారు. వీరు గోనుపల్లి నుంచి చాటగిరి చెలలు వద్ద చేరుకోగా అక్కడ కొందరు మోటారు సైకిల్‌తో కనిపించారన్నారు. వారిని చుట్టుముట్టడంతో వారిలో కొందరు పారిపోగా ఒకరు పట్టుబడ్డారన్నారు. ఇతనిని గోనుపల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించామని తెలిపారు. సమీపంలోనే 15 ఎర్రచందనం దుంగలు వున్న డంప్ కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

కట్నం వేధింపు కేసులో మూడేళ్లు జైలు

ప్రజాశక్తి - పుత్తూరుటౌన్ : భార్యను వరకట్నం కోసం వేధించిన కేసులో పుత్తూరు మండలంలోని నెత్తం గ్రామానికి చెందిన రామయ్య కుమారుడు సూరి బాబుకు మూడేళ్లు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు నిచ్చారు. సూరిబాబు భార్య దివ్య భారతి(34) ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద పుత్తూరులో కేసు నమోదైంది. ఆమె భర్త సూరిబాబు (42) తనను వరకట్నం కోసం వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. కోర్టుకు వెళ్లిన కేసు విచారణలో జెఎఫ్‌సి ఎం జడ్జి వి గోపాలకృష్ణ నిందితుడికి మూడు సంవత్సరాలు కఠిన కారాగార శిక్షతో పాటు ఐదు వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని పుత్తూరు అర్బన్ ఎస్ఐ కెవి సురేంద్రనాయుడు తెలిపారు.

డ్రైవర్లకు జరిమానా, జైలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్ల పై ట్రాఫిక్ పోలీసు వారు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 30 మంది నిందితులును 4 వ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు తిరుపతిలో హాజరుపరచగా జడ్జి గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున మొత్తం 30 మందికి 3 లక్షల రూపాయలు జరిమానా విధించారు. ఇందులో నలుగురికి మూడు రోజులు జైలు శిక్ష, ద్విచక్రవాహనాలు నడిపిన వారికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

రైతులకు గిట్టబాటు ధరలు కల్పించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వ్యవసాయ మోటార్లకు మీటర్ల ఏర్పాటు నిర్ణయా న్ని ప్రభుత్వం వెనక్కి తీసుకుని రైతులకు గిట్టు బాటు ధరలు కల్పించా లని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఏఐకెఎస్) గూడూరు డివిజన్ నాయకులు జోగి శివకుమార్ డిమాండ్ చేశారు. గూడూరు మండల తహశీల్దారు కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు జోగి శివకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని దీంతో రైతులు నూతన ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని అయితే ఈ ప్రభుత్వం వచ్చి వంద రోజులు అవుతున్నా రైతుల గురించి ఏమీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఒక్కో రైతుకు ఇరవై వేల రూపాయలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నియోజక వర్గ నాయకులు శ్రీనివాసులు, సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్, మండల నాయకులు వెంకటయ్య, చంద్రయ్య, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.

'శ్రీరామ'లో స్వచ్ఛత హి సేవ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి - కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో స్వచ్ఛత హి సేవను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేణిగుంటకు చెందిన వెంకటాద్రి యాదవ్, కళాశాల జాతీయ సేవ విభాగం వాలంటీర్లు ఆధ్వర్యంలో సుమారు 50 మొక్కలు నాటారు. కళాశాల డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛభారత్ వల్ల ఎన్నో ప్రయోజనాలు కలుగుతున్నాయన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు మరింత ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె జయచంద్ర మాట్లాడుతూ కళాశాలలో జాతీయ సేవ విభాగం చుట్టుపక్కల గ్రామాల్లో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, విభాగాధిపతులు, జాతీయ సేవ విభాగం ఆఫీసర్ ఎస్ చక్రిశ్రీధర్, వాలంటీర్లు పాల్గొన్నారు.

క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం వ్యవస్థాపక దినోత్సవంతో పాటు కేంద్ర ప్రభుత్వ పిలుపుమేరకు స్వచ్ఛత హి సేవాను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సి భువనేశ్వరి సమాజంలో పరిశుభ్రత సందేశాన్ని వ్యాప్తి చేయాలని, మీ ప్రాంతాలలో, గ్రామాల్లో వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, పరిశుభ్రతకు వ్యక్తిగత బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఏ రవి కుమార్ మండలంలోని ముచ్చు వోలులో బుధవారం పశువైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భం గా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి బాలసుబ్రమణ్యం 38 పాడి పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. తగు సూచనలు, సలహాలు అందించారు. అనంత రం నిర్వహించిన లేగ దూడ ల ప్రదర్శనలో ఉత్తమ జాతి లక్షణాలు కలిగిన దూడ లకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కాళహస్తి ఏడీ డాక్టర్ శ్రీకాంత్ బాబు, డాక్టర్ ఊహ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.